క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



ఆలయ కమిటీకి బంగారం అందజేస్తున్న దాత రెడ్డి శివశంకర్ దంపతులు

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మకు భీమవరానికి చెంది రెడ్డి శివశంకర్, రాధారాణి దంపతులు 15 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయప్రాంగణంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. దాత దంపతులకు ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి, ప్రసాదం, శేష వస్త్రం, ఫొటో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ ఫిల్మ్‌లకు ఉత్తమ అవార్డులు



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న దృశ్యం

వీరవాసరం: మండలంలో రెండు షార్ట్ ఫిల్మ్‌లకు ఉత్తమ చిత్రాలుగా అవార్డులు లభించాయని ఆదివారం అవార్డు గ్రహీతలు తెలిపారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన వీకేఆర్ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌లో రాయకుదురుకు చెందిన డాక్టర్ అడబాల లక్ష్మీనారాయణ తీసిన తొలి షార్ట్ ఫిల్మ్ ×రోజా చేసిన గాయం్డ కు ఉత్తమ చిత్రంగా అవార్డు వచ్చిందని చిత్ర దర్శకులు అడబాల లక్ష్మీనారాయణ తెలిపారు. ఇదే విధంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన వీకేఆర్ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌లో తొలి షార్ట్ ఫిల్మ్ ఎక్స్‌చేంజ్‌కు ఉత్తమ షార్ట్ ఫిల్మ్ అవార్డు వచ్చిందని చిత్ర దర్శకులు నరసన్నచెరువు పాలేనికి కవురు నాగరాజు తెలిపారు. అవార్డు గ్రహీతలను మండల నాయకులు, పలువురు అభినందించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సబ్‌స్టేషన్ పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

వీరవాసరం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదానికి గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం ఎలక్ట్రికల్ ఏఈ రవికుమార్ వర్మ తెలిపారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోకూడదని, తడిసిన చేతులతో స్టార్టర్లు కానీ మోటార్లు కానీ ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల దగ్గరకు రాకుండా చూసుకోవాలని, క్వార్టర్‌లలో ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయకూడదన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసి వేయాలని, టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్‌లను స్విచ్ ఆఫ్ చేయాలని లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్టీయూ నేతలు

భీమవరం: సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను సాధించే వరకూ ఎస్టీయూ పోరాటాలు చేస్తుందని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో చైర్మన్ సాయి వర్మ స్పష్టం చేశారు. భీమవరం ప్రకాశంచౌక్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పింఛన్ బిక్ష కాదని, హక్కు మాత్రమేనని పాలకులు గుర్తించాలన్నారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఒక్క ఓపీఎస్ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో జనార్దన్, వేదాల ఉదయ కుమార్, కరక సత్యనారాయణ, కొడమంచిలి శ్రీనివాస్, చుండూరి ప్రసాద్, పాల్గొన్నారు.

బాలుర హాస్టల్ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల ఇంటిగ్రేడ్ బాలుర హాస్టల్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్ విద్యార్థులతో కష్టపడి ఇష్టంగా చదవాలని తెలిపారు. హాస్టల్‌లో అందిస్తున్న భోజనం వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ భోజనాన్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు.

నిండా ముంచిన వాన

- ముంపులో వరి పొలాలు
- శివారు గ్రామాలు జలమయం



ఆకివీడు: నీట మునిగిన వరి దుబ్బులను చూపిస్తున్న రైతులు



కాళ్ల: సీసలి సత్యనారాయణపురం రహదారిపై నిలిచిన వర్షపు నీరు

కాళ్ల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. గతంలో కురిసిన వర్షాలకు నారుమళ్లు నీట మునిగి ఇబ్బందులు పడి, తిరిగి నాట్లు వేసుకున్న రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. భారీ వర్షాలతో ఆలస్యంగా నాట్లు వేసిన పొలాలన్నీ ముంపు బారిన పడ్డాయి. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల లంక ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇదేపరిస్థితి మరో రెండు రోజులు కొనసాగితే ఇంకా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఉప్పుటేరు బిగతన్నితే మరింత నష్టాల పాలవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 3700 ఎకరాల్లో సాగవుతుందని, భారీ వర్షాలకు 291 ఎకరాల పంట నీట మునిగిందని వ్యవసాయ అధికారి జయవాసుకి తెలిపారు. ఈ ముంపు వలన మండలంలో ఆయా గ్రామాల్లో 138 రైతులు ఇబ్బంది పడుతున్నారని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఆమె స్పష్టం చేశారు.

శివారు గ్రామాలను ముంచిన వర్షం

కాళ్ల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శివారు గ్రామాలు వర్షపు నీటితో నిండిపోయాయి. ప్రధాన రహదారులు, గ్రామంలోని అంతర్గత రహదారులు కాలువలను తలపించాయి. ప్రధానంగా కాళ్ల గ్రామ శివారు గాంధీనగర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి వర్షపు నీటితో కాలువను తలపిస్తుంది. అంతేకాకుండా సీసలి గ్రామ శివారు సత్యనారాయణపురం పంట కాలవ రోడ్డు ఏకమై నడవడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని ఆ ప్రాంత ప్రజలు వాపోయారు.

42 ఎకరాల ముంపు

ఉండి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండలంలోని యండగండి, ఉప్పులూరు గ్రామాల పరిధిలో 42 ఎకరాలు వరి చేలు ముంపునకు గురైనట్లు మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆదివారం తెలిపారు. గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ముంపు ప్రమాదం తప్పలేదన్నారు. ముఖ్యంగా యండగండి, ఉప్పులూరు ప్రాంతాల్లోనే ముంపు సమస్య అధికంగాఉందని తెలిపారు. ఆదివారం వర్షం కురవకపోవడంతో రైతులు వరిచేలల్లో నీటిని తరలించే ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె తెలిపారు.



ఉండి: యండగండిలో ముంపునకు గురైన వరి చేలను పరిశీలిస్తున్న అధికారులు



కాళ్ల: కాలువ మాదిరిగా మారిన కాళ్ల శివారు గాంధీనగర్ రహదారి

కుళ్లిపోనున్న వరి పొలాలు

ఆకివీడు: భారీ వర్షాలకు వరి చేలు నీట మునుగుతున్నాయి. వర్షం తగ్గినప్పటికీ ముంపు నీరు పెరుగుతుంటే వరి చేలు కుళ్లిపోయి, తీవ్ర నష్టం ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. మండలంలోని దుంపగడప, అజ్జమూరు, చెరుకుమిల్లి, కుప్పనపూడి, గ్రామాల్లో అధికంగానూ మాదివాడ, ధర్మాపురం, సిద్ధాపురం, చినమిల్లిపాడు, కోళ్లపర్రు, చినకాపవరం, పెదకాపవరం తదితర గ్రామాల్లో మోస్తరుగానూ వరి మొక్కలు ముంపునకు గురయ్యాయి. మండలంలో 249 హెక్టార్లలో వరి నీట మునిగిందని అధికారులు అంచనా వేశారు. పంట కాలువలకు శివారు ప్రాంతంగా ఉన్న ఆకివీడు మండలంలోని పల్లపు ప్రాంతాలకు ఎగువ నుంచి ముంపు నీరు మరో రెండు మూడు రోజులు అధికంగా ప్రవహించే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముంపు నీటి బెడదతో పాటు ఉప్పుటేరులో పూడికల వలన నీటి ప్రవాహం మందగిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వలన మురుగు, పంట కాలువలోని అదనపు నీరు బయటకు వెళ్లడం లేదని చెబుతున్నారు.సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గడువివ్వండి మహాప్రభో..

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులోని కాలువ గట్టుపై నివసిస్తున్న బాధితుల ఇళ్లు తొలగించేందుకు సమయం ఇవ్వాలని కలెక్టర్ నాగరాణికి బాధితులు మొర పెట్టుకున్నారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆమెకు వినతి పత్రం అందజేసి, గత 50 ఏళ్లుగా ఇక్కడే తరతరాలుగా నివసిస్తున్నామన్నారు. మా ఇళ్లకు పన్ను కట్టించుకుంటున్నారని, విద్యుత్, పైపులున్నాయని, రోడ్లు వేశారని తెలిపారు. మాకు ఇళ్ల స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయం అందజేస్తే ఖాళీ చేసి వెళ్లిపోతామని, గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ కాలువలను కలుషితం చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

కారుతో ఢీకొన్నారంటూ ఫిర్యాదు

భీమవరం: పట్టణంలోని బలుసుమూడి రోడ్డులో నడిచి వెళుతుండగా వెనుక నుంచి కారుతో ఢీ కొట్టారంటూ ఎస్.సాంబయ్య ఫిర్యాదు చేశాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. కారును నిర్లక్ష్యంగా నడిపి ఢీ కొన్నాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ప్రస్తుతం బాధితుడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై మోహనరావు తెలిపారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

తన భర్త, అత్త మామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ టూటౌన్‌లోని ప్రకాష్‌నగర్‌కు చెందిన ఎం.ప్రశాంతి ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఎం.ప్రశాంతికి ఈ ఏడాది జనవరిలో వివాహమైందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రెహమాన్ తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఆకివీడు: మండలంలోని అయి భీమవరంలో గొడన్స్ సమీపంలో పేకాడుతున్న నలుగురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 22,250, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యార్థులకు గురువులే దైవం



ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం : సమాజంలో అన్ని వర్గాల వారితో గౌరవించబడే వారు ఉపాధ్యాయులని, తల్లి తండ్రి తరువాత గురువే మనకు దైవమని జిల్లా యూత్ హాస్టల్స్ అసోసియేషన్ కార్యదర్శి మాట్లపూడి సత్యనారాయణ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. రిటైర్డ్ హెడ్ మాస్టర్ కలిగొట్ల గోపాలశర్మ, ఆర్ఆర్‌డీఎస్ కళాశాల అధ్యాపకులు పి.అమూల్యారావు, పి.రాజబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రపంచ మేధావులకు గురువులే మార్గ దర్శకులని, 2, 3 తేదీల్లో విద్యార్థులకు ఉపాధ్యాయుల సేవలపై పోటీలు, 4న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారాలు చేస్తున్నామన్నారు. అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్ కే చాన్ భాషా, భానుమణి, శ్యామల, విద్యార్థులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్ వర్ధంతికి తరలిరండి

ఉండి: మండలంలో నిర్వహించే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహారాజు ఆధ్వర్యంలో ఉండి పోలీస్‌స్టేషన్ పక్కన గల వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తామని, ప్రతీ ఒక్కరూ ఉదయం 9 గంటలకు విగ్రహం వద్దకు రావాలని ఆయన తెలిపారు.

నేడు మహానేత వైఎస్సార్ వర్ధంతి

ఆకివీడు: మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం 2వ తేదీ సోమవారం స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో నిర్వహిస్తున్నామని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ సంస్థల నాయకులు హాజరవుతారని చెప్పారు. మండలంలోని దుంపగడపలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చిట్టిబాబు చెప్పారు.

నిత్యావసర సరుకుల అందజేత

భీమవరం : స్థానిక తాడేరు రోడ్‌లోని ఇందిరమ్మ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న అనగ్ల దుర్గమ్మ అనే పేదరాలికి మానవత సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యవసరాలు, ఒక బస్తా బియ్యం అందించామని మానవత సంస్థ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కో-చైర్మన్ కార్మూరి నరసింహమూర్తి బాబు, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తూరలు తొలగించారు



అందేవారి బోదెలో తొలగించిన తూరలను, పగిలిన పైప్‌లైన్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: స్థానిక మాదివాడలోని అందేవారి బోదెలో మార్గం కోసం వేసిన తూరలను శనివారం అర్ధ రాత్రి అక్రమంగా తొలగించారని, నగర పంచాయతీ అనుమతి లేకుండా జేసీబీతో తొలగించడంపై చైర్ పర్సన్ జామి హైమావతి, ఆ ప్రాంత కౌన్సిలర్ మోటుపల్లి కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా తొలగించిన వాటిని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ అనుమతి లేకుండా, ఆస్తిని ధ్వంసం చేయడం తగదన్నారు. గతంలో పంచాయతీ నిధులతోనే తూరలు వేయించామన్నారు. తూరలు అడ్డుగా ఉంటే నగర పంచాయతీ సిబ్బందితో తీయించే వాళ్లమని చెప్పారు. అర్ధ రాత్రి తొలగించడంతో కుళాయి పైప్‌లైన్ ధ్వంసమయ్యిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వివరిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో బాధితులు మాట్లాడుతూ అందేవారి బోదెలోని కాలిబాట కోసం వేసిన తూరలతో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేదన్నారు. చాలా కాలంగా ఉన్న తూరలను అర్ధ రాత్రి తొలగించాల్సిన అవసరమేమిటని వారు ప్రశ్నించారు. తమకు కుళాయి నీరు రాకుండా చేశారని వాపోయారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పుప్పాల పండు, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగు, దొడ్డి జగదీష్, వైసీపీ నాయకులు ఎండీ ఆలీ, మోటుపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ విజేతకు సత్కారం



గోల్డ్ మెడల్ విజేతను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: అంతర్ జిల్లా స్థాయి ఈత పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన కోరశిఖ మోక్షితను ఆదివారం సత్కరించారు. మోక్షిత తండ్రి వీర్రాజు పదో తరగతి 1986-87 బ్యాచ్‌కు చెందిన పూర్వపు మిత్రులు మోక్షితను ఆదివారం అభినందించారు. తమ మిత్రుడి కుమార్తె ఈత పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధించడంతో ఆమెను మొమెంటో, శాలువాతో ఆమె స్వగృహంలో సత్కరించారు. మోక్షిత ప్రస్తుతం ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. తండ్రి భీమవరం సీతా పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ సబ్జెక్ట్ అధ్యాపకుడిగాను, తల్లి కవిత ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. తమ కుమార్తె ఈత పోటీల్లో రాణించడంతో ఆ దిశగా ఆమెను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు యేలూరి భాను కుమారి, చల్లాయమ్మ దుర్గ, గుండె మంగతాయారు, ముద్రగళ శ్రీనివాస్, రాము, ఆర్ కె. నాయుడు, మట్టా నళినీ మోహన్ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి నెలకొల్పాలి




నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

భీమవరం అర్బన్: యుద్ధాలు వలన ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడమే కాకుండా లక్షలాది మంది గాయాల పాలవుతున్నారని, కావున ప్రపంచ శాంతిని నెలకొల్పాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ కోరారు. భీమవరం మండలంలోని తోకతిప్పలో ఆదివారం ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా యుద్ధాలు వద్దు శాంతి కావాలని సీఐటీయూ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇజ్రాయేల్-పాలస్తీనా యుద్ధం వలన అనేక మంది పిల్లలు, మహిళలు మృతి చెందారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తిరుమాని నాగేశ్వరరావు, బొడ్డు లక్ష్మీపతి, పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాని సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. వ్యాధుల గాలం

- పొంచి ఉన్న ముప్పు
- అప్రమత్తతే నివారణ మార్గం



ఆడ ఎనాఫిలిస్ దోమ (ఫైల్)



ఆడ ఈడీస్ దోమ (ఫైల్)

భీమవరం అర్బన్: వర్షాకాలంలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. రెండు నెలలుగా వర్షాలు పడటంతో పల్లెల్లో కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో మురుగునీరు నిల్వ ఉండిపోయి దోమలు విజృంభించి పగలు, రాత్రి తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. దీంతో ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు, పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పరాన్న జీవితో మలేరియా

మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవి సంక్రమించిన ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వస్తుంది. ఈ దోమలు మంచి నీరు, మురుగు నీటి నిల్వల్లో లార్వా వృద్ధి చెంది మలేరియాను వ్యాప్తి చేస్తాయి. ఈ దోమ కుట్టడం వలన ఏడు నుంచి 10 రోజుల లోపు ఒళ్లు నొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజు మార్చి రోజు వస్తుంది. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యుడిని సంప్రదించి, రక్త పరీక్షలు చేయించుకోవాలి.

పగటిపూట దోమకాటుతో డెంగీ



గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులను పరీక్షిస్తున్న దృశ్యం (ఫైల్)

దోమ కాటు ద్వారా అకస్మికంగా జ్వరంతో పాటు ఒళ్లు నొప్పులు వస్తే అది డెంగీ కావచ్చు. ఇది ఆడ ఈడీస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఇవి పగటి పూట ఎక్కువగా కుడతాయి. ఈ దోమకాటు వేసిన మూడు నుంచి 14 రోజుల్లో డెంగీ రావచ్చు. ఈ వ్యాధి వలన జ్వరంతో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, వాంతులు అవుతాయి. కొంతమందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తం కారుతుంది. దీనికి అత్యవసరమైన చికిత్సతోపాటు కొందరికి ప్లేట్‌లైట్స్ ఎక్కించాల్సి వస్తుంది. గర్భిణులు, చిన్న పిల్లలు ఇతర దీర్ఘ కాలిక వ్యాధులు ఉన్న వారికి ప్రమాదం ఎక్కువ. త్వరితగతిన చికిత్స చేయించుకోవాలి.

చికెన్ గున్యా లక్షణాలు

చికెన్ గున్యా వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన ఈడీస్ దోమ కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తుంది. ఈ దోమ కుట్టిన 3 నుంచి 12 రోజుల లోపు జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం దీని ముఖ్య లక్షణం.

కలుషిత ఆహారంతో డయేరియా

కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వలన డయేరియా (అతిసార), టైఫాయిడ్ వస్తాయి. రోజుకు మూడు అంతకంటే ఎక్కువ సార్లు నీళ్ల విరేచనాలు అయితే అతిసార వ్యాధి అంటారు. ఇది బ్యాక్టీరియా వలన కానీ, వైరస్, పరాన్న జీవుల వలన కానీ రావచ్చు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి, దాహం, నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం ఈ వ్యాధి లక్షణాలు. అలాగే ఫైలేరియా కూడా దోమల వలనే వ్యాపిస్తుంది. ఈ వ్యాధులను అధిగమించే క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు.

వ్యక్తిగత శుభ్రత అవసరం



సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ముఖ్యంగా వైరస్, బాక్టీరియా వలన వ్యాధులు వస్తాయి. వీటి గురించి అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండొచ్చు. ప్రస్తుత వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఇంట్లో వండుకునే పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలి. వంటపాత్రలపై మూతలు పెట్టుకోవాలి. ఇంటి చుట్టూ మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా, మురికి కూపాలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి శుక్రవారం తప్పకుండా డ్రై డే పాటించాలి.

– ఎ.అరుణరాణి, వైద్యురాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గొల్లవానితిప్ప

పత్రికా ప్రకటన